కౌలు రైతులకు దక్కని భరోసా

- కౌలు రైతులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నియోజకవర్గంలో టార్గెట్ 5,300 ఉంటే జారీ చేసిన సీసీఆర్ కార్డుల సంఖ్య 3,559 మాత్రమే..
- కౌలు రైతులకు సుఖీభవ ఇవ్వని వైనం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కౌలుదారునికి రూ.13,500 పెట్టుబడి సాయం


సంజామల వద్ద కౌలుకు సాగు చేసిన మొక్కజొన్న పంట

సంజామల: కౌలు రైతులకు ఈ ఏడాది కూడా కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచే విధంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలు రైతులు అన్ని విధాలుగా నష్టపోతున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.20 వేలు అందిస్తామని ఎన్నికల ముందు కూటమి హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక మొదటి సంవత్సరం రైతులకు మొండి చేయి చూపించి.. రెండవ ఏడాది షరతులతో రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని కేంద్రం ప్రభుత్వం వాటా రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.5 వేలు కలిపి రూ.7వేలు ఇచ్చింది. కానీ కౌలు రైతులకు మాత్రం నిధులను కేటాయించ లేదు. దీంతో కౌలు రైతులు నిరాశ చెందుతున్నారు.

ఎన్నికల్లో ఊదరగొట్టి.. గెలిచాక పక్కన పెట్టి

ఎన్నికల ముందు కూటమి పార్టీలు సాధ్యం కానీ హామీలతో ఊదరకొట్టాయి. తాము అధికారంలోకి వచ్చాక గతం కంటే మిన్నగా పాలనా సాగిస్తామని అధికారంలోకి వచ్చాకా కౌలు రైతులను పట్టించుకోవడంలేదు. బనగానపల్లె నియోజకవర్గంలో దాదాపు 5,300 సీసీఆర్ కార్డులు ఇవ్వాలని టార్గెట్ ఉంది. కానీ వ్యవసాయ అధికారులు ఈ రోజు వరకు 3,559 కార్డులే మంజూరు చేశారు. దాంతో పాటు రైతులకు ఉచిత పంట బీమా, ఇన్‌పుట్స్ సబ్సీడీ ఏమి కూడా ఏడాది రైతులకు అందలేదు. రైతులుకు గత ప్రభుత్వం ఉచిత బీమాను ప్రవేశపెట్టింది. కూటిమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత బీమాను రద్దుచేస్తూ రైతులపై ప్రీమియం భారం వేసింది. కౌలు రైతులకు ప్రతి ఏటా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందిస్తామని హామి ఇచ్చి.. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నార అవుతున్న కౌలు రైతులకు మాత్రం మొండి చేయి తప్పడంలేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కౌలు రైతులకూ భరోసా

2019 అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులతో పాటు కౌలు రైతులకు సమానంగా రూ.13,500 మొత్తాన్ని రైతు భరోసా రూపంలో అందించింది. రైతులకు అందించే ప్రతి సంక్షేమాన్ని కౌలు రైతులకు వర్తిపంజేస్తూ వారిని అన్ని విధాలా ఆదుకుంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వలేదు. పైగా సరైన సమయంలో ఎరువులు, యూరియా లభించకపోవడంతో రైతులు పరిస్థితి దయనీయంగా మారింది. ఈ ఏడాదైన కౌలు రైతులకు సాయం అందుతుందాని రైతులు ఎదరుచూస్తున్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కౌలు రైతులకు రూ.13,500 రైతు భరోసా పథకం కింద అందజేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చకా కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని చెప్పారు. ఈ ఏడాదైన రైతుకు ఆదుకోవాలని కోరుతున్నాం. ప్రతి ఏటా 3 ఎకరాలలో మిరప పంట సాగు కౌలుకు సాగు చేస్తున్నా. గతేడాది తీవ్రంగా నష్టపోయాం. ఈ ఏడాది కౌలు రైతులకు సాయం అదించాలి.

-కరీం బాషా, కౌలు రైతు,సంజామల మండలం

కౌలు రైతుల బాధలు కనిపించవా?



గుత్తలకు పొలం తీసుకుని సాగుచేస్తున్నాం. కౌలు రైతుల బాధలు కూటమి ప్రభుత్వానికి వినపడవా?. రైతు తీవ్రంగా నష్టపోతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లులేదు. ఎన్నికల ముందు సాధ్యం కానీ హామీలను ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించారు. కౌలు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. అన్నదాత సుఖీభవ పథకం కింద కౌలు రైతులకు రూ.20 వేలు సాయం అందించాలి.

-అన్నెం శివరామిరెడ్డి, రైతు విభాగ మండల అధ్యక్షుడు,సంజామల మండలం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



ప్రభుత్వం నుంచి కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించే విషయంలో ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కౌలు రైతుల ఎంపిక జాబితాను సిద్ధం చేస్తాం. కౌలు రైతులకు పెట్టబడి సాయం ఎప్పుడు అందిస్తారనేది అనేది సమాచారం రాలేదు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన కౌలుదారులకు సీసీఆర్ కార్డులను మంజూరు చేశాం.

– భూమ జ్యోతి, ఏఓ, సంజామల

క్లుప్తంగా

క్షణికావేశంతో జీవితాలను బలిచేసుకోవద్దు


మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి

కోవెలకుంట్ల: జీవితంలో అన్ని రకాల సమస్యలు సహజమని, క్షణికావేశానికి లోనై జీవితాలను బలిచేసుకోవద్దని వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు విభాగాధిపతి కృష్ణశశాంక ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో ఏవైనా సమస్యలు తలెత్తితే మనో ధైర్యంతో ఎదుర్కొని సాధించుకోవాలన్నారు. అలా కాకుండా వాటికి బయపడి జీవితాన్ని ముగించుకోవాలనుకోవడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. బాధలు, కష్టాల్లో ఉన్నవారితో మాట్లాడి సలహాలివ్వాలని, వారిలో మనో ధైర్యాన్ని నింపాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, కృష్ణదాసు, నరేంద్రనాథ్‌రెడ్డి, చంటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బనగానపల్లె రూరల్: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పరిపాలన అధికారి నాగరాజు బుధవారం తెలిపారు. స్థానిక పొదుపు భవనంలో ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్నిశాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు తప్పకహాజరుకావాలన్నారు.

టీకాలు వందశాతం పూర్తి చేయాలి


టీకాల ప్రక్రియను పరిశీలిస్తున్న డీఐఓ

కోవెలకుంట్ల: పుట్టిన ప్రతి బిడ్డకు టీకాలు వేసి జాతీయ వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సుదర్శన్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఐదవ గ్రామ సచివాలయ పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు వేస్తున్న టీకాల వివరాలు, ఏఎన్ఎం, ఆశావర్కర్ల రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి పదిసంవత్సరాల్లోపు చిన్నారులకు సంబంధించిన ఎంఆర్ వన్, ఎంఆర్ టూ టీకాలను అందించి చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచాలన్నారు.టీకాలు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ జగదీశ్వరప్ప,సూపర్‌వైజర్ మునిస్వామి, వైద్య సిబ్బంది సంటెన్న, మైమూన్, ఆశావర్కర్లు మేరి, లత, రామసుబ్బమ్మ పాల్గొన్నారు.

పంటలు నమోదు చేసుకోవాలి

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను రైతులు త్వరితగతిన ఈ పంట ద్వారా నమోదు చేసుకోవాలని వ్యవసాయ ఉప సంచాలకులు సుధాకర్, ఏఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని చిన్నకొప్పెర్ల, బిజనవేముల రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రకతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం జరిగితే ఈ పంట నమోదు ఆధారంగానే నష్టపరిహారం అందుతుందన్నారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగంతో అనే ప్రయోజనాలున్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఈ పంట నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాంకేతిక వ్యవసాయ అధికారి బాషా, వ్యవసాయ సహాయకుడు మనోజ్, ధరణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సంజామల: గ్రామాల్లో సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. మండల కేంద్రం సంజామల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయితీ కార్యదర్శిలు, విలేజ్ రెవెన్యూ అధికారులు, విలేజ్ సర్వేయర్లుతో తహసీల్దార్ అనిల్ కుమార్, ఎస్ఐ రమణయ్యతో కలసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లడుతూ.. గ్రామాలలో పారిశుద్ధ్య సమస్యలు, ఏ ఇతర సమస్యలైనా అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. ఒకరు మృతి

డోన్ టౌన్ : చిన్న మల్కాపురం గ్రామ విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం బైకును ఢీ కొనడంతో ప్రభాస్(19) మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని చిగురమానుపేటకు చెందిన ప్రభాస్,ఉమేష్ బైకుపై నంద్యాలకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఇందులో ప్రభాస్ తీవ్రగాయాలతో మృతి చెందగా, ఉమేష్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమ్మిత్తం వైద్యశాలకు తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కోవెలకుంట్లలో వర్షం

కోవెలకుంట్ల: గత నాలుగు రోజుల నుంచి వేసవి కాలాన్ని తలపించేలా ఎండలు మండుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఎండతీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. రాత్రికి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన కొదండరామ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన సుబ్బారావు అనే వ్యక్తిని పాతకక్షలను మనసులో పెట్టుకొని నిందితుడు దాడికి పాల్పడ్డాడన్నారు. సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చట్టాలపై అవగాహన

కోవెలకుంట్ల: పట్టణంలోని కళాశాల ఎస్సీ బాలికల వసతి గృహంలో బుధవారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థినులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు అమల్లో ఉన్నాయని, చట్టాలగురించి పూర్తిస్థాయిలో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మిత్రుడికి సాయం

బేతంచెర్ల: మండలంలోని ఆర్.బుక్కాపురం గ్రామానికి చెందిన వై.మధు అనే యువకుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆర్.కొత్తపల్లె జెడ్పీ హైస్కూలు 2003–04లో 10వ తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు సేకరించిన రూ.26 వేల నగదును బుధవారం మిత్రుడికి అందజేశారు.

శిథిలావస్థలో పశువైద్యశాల


పురాతన బనగానపల్లె పశువైద్యశాల

బనగానపల్లె : పలు గ్రామాలకు కేంద్రంగా ఉన్న బనగానపల్లె పశువైద్యశాల పురాతనంగా ఉన్నందున ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది వీధి నిర్వహణలో ఇబ్బందులుపడుతున్నారు. 1941లో బనగానపల్లె సంస్థానాన్ని నవాబులు పరిపాలించుకాలంలో సువిశాలమైన స్థలంలో పశువైద్యశాలను నిర్మించారు. ఆ సమయంలోనే వైద్యాధికారి నివాస గృహం సిబ్బంది క్వార్టర్స్ కూడా ఏర్పాటు చేయడం జరిగింది. పశు వైద్యశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి ఎటువంటి అభివృద్ధికి నోచుకొనందున శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో వర్షపు నీరు లోపలికి చేరుతున్నందున వైద్యులు, సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వైద్యశాలకు పశువులను తీసుకొచ్చే రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది. దీనికితోడు పశువైద్యశాల చుట్టూ అపరిశుభ్రత నెలకొనడంతో విషసర్పాలు అప్పుడప్పుడు లోపలికి రావడంతో భయందోళనగా ఉన్నట్లు సిబ్బంది వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేసి పశు వైద్యశాలను, సిబ్బంది క్వార్టర్స్‌ను నూతన నిర్మించాల్సిన అవసరం ఉంది.

బేతంచెర్లలో ఉద్రిక్తత


గుమిగూడిన జనం

బేతంచెర్ల: పట్టణంలోని కొలుములపల్లె రహదారిలోని బైటిపేట కళ్లాల వీధి సమీపంలో నన్న స్థలాల విషయంలో ఇరువర్గాల మధ్య బుధవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ స్థలాలు పట్టణానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై 35 సెంట్లు ఉండగా, మరో వ్యక్తి ఆ స్థలం అంతా తనదేనని కోర్టును ఆశ్రయించి ఐదుగురికి నోటిసులు పంపారు. కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేస్తామని ఇరువర్గాల వారిని స్థలం దగ్గరకు రావాలని సూచించారు. అయితే అక్కడికి జనం భారీగా చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి గొడవకు దారితీయడంతో ఎస్ఐ రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది ఇరువర్గాలను చెదరగొట్టారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలి


మాట్లాడుతున్న రాముడు

ప్యాపిలి: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని జిల్లా అబ్జర్వర్, డైట్ కళాశాల లెక్చరర్ రాముడు సూచించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలను బుధవారం ఎంఈఓ వెంకటేష్ నాయక్‌తో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. సరైన ప్రణాళికతో చదివేలా విద్యార్థినులను ప్రోత్సహించాలన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు అన్ని సబ్జెక్టుల పట్ల ఆసక్తి కలిగించాలని చెప్పారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించాలన్నారు. అనంతరం సెల్ఫ్ అసెస్మెంట్ పుస్తకాలు, సిలబస్, ప్రోగ్రెస్ కార్డులు, మధ్యాహ్న భోజనం రికార్డులు, ఇతర రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ ప్రియాంక, సీఆర్పీలు రామాంజి, నవీన్ పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత చదువులు చదవాలి


జడ్జిని సత్కరిస్తున్న మోడల్‌స్కూల్ విద్యార్థినులు, అధ్యాపకులు

డోన్: బాలికలు ఉన్నత చదువులు చదువుకొని ఆర్థికంగా నిలదొక్కుకున్న నాడే సమాజం బాగుంటుందని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ అన్నారు. స్థానిక మోడల్‌స్కూల్‌లో విద్యార్థులనుద్దేశించి బుధవారం ఆమె మాట్లాడుతూ..బాలికలకు భవిష్యత్తుపై దిశానిర్దేశం చేశారు. చదువు నుంచి సంస్కారం సభ్య సమాజం ఏర్పడుతుందని, అన్ని అనర్థాలకు అవిద్య, అజ్ఞానమే మూల కారణమని అన్నారు. భవిష్యత్తులో ఆడవారు ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవాలంటే విద్యావంతులై ఉండాలన్నారు. మోడల్‌స్కూల్ విద్యార్థులకు ఎలాంటి సహాయం కావాలన్నా చేస్తానని జడ్జి హామీనిచ్చారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు జడ్జిని ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాది నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ


జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బేతంచెర్ల: స్థానిక శ్రీ చైతన్య విద్యార్థులు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం రైజింగ్ ఇండియా సందర్భంగా 100 మీటర్ల పొడవుగల జాతీయ జెండాతో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి భారతమాత వేషధారణలో ప్రధాన రహదారి వెంట పాత బస్టాండు వరకు దేశ నాయకుల సేవలను కొనియాడుతూ నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ వాసవి పాల్గొన్నారు.

ఇష్టంతో చదవండి

బేతంచెర్ల: తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు ఇష్టంతో కష్టపడి చదవి ఉత్తమ ఫలితాలు సాధించాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ అబీదా బేగం విద్యార్థినులకు సూచించారు. బుధవారం ప్రభుత్వం నుంచి 280 మందికి మంజూరైన పరుపులను విద్యార్థులకు అందజేశారు. అలాగే ఎంఈఓ సోమశేఖర్ కేజీబీవీని సందర్శించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని చెప్పారు.

కొండవీడు ఎక్స్‌ప్రెస్ ఆపడంపై హర్షం

బేతంచెర్ల: కరోనా సమయం నుంచి స్థానిక రైల్వే స్టేషన్‌లో కొండవీడు ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్‌ను రద్దు చేశారు. అయితే బుధవారం నుంచి ఆ రైలును ఆపడంపై ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజాం బేగ్, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. అలాగే..అమరావతి, చిన్న అమరావతి, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా ఆపాలని కోరారు.

చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుందాం



ఐలమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : దున్నేవాడిదే భూమి అనే నినాదంతో సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ నిప్పురవ్వ వంటిందని ఎంతో మందిలో స్ఫూర్తి నింపి వారిని చైతన్య పరిచిందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక నక్కి రామన్న భవన్‌లో అమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ కార్యదర్శి మోటా రాముడు,నాయకులు నాగరాజు,పులిశేఖర్, హరి,రంగస్వామి ఉన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్ రావు

బేతంచెర్ల: ప్రజలు మలేరియా, డెంగీ తదితర విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్ రావు, సహాయ అధికారి సత్యనారాయణ సూచించారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బందితో ప్రస్తుతం ప్రబలుతున్న విష జ్వరాలపై ప్రజలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉందని, వాటి ద్వార జ్వరాలు ప్రబలుతాయని చెప్పారు. ఇందుకు నివారణగా.. పరిసరాల శుభ్రత, మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే ఆర్ఎస్ రంగాపురం గ్రామ ఎస్సీ కాలనీలో వైద్యులు అబ్దుల్ అలిం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్యులు తస్లిమా, ప్రియాంక, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్లు రామాంజనేయులు, విజయ కుమార్ పాల్గొన్నారు.

డోన్ టౌన్ : విష జ్వరాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలిసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నమల్కాపురం వైద్యాధికారి సూర్యప్రకాష్ వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం చిన్నమల్కాపురం,జలదుర్గం పీహెచ్‌సీలను సందర్శించి రికార్డులు పరిశీలించారు.

భరించలేని దుర్వాసన


ఎస్సీ బాలికల వసతి గృహం వద్ద నిలిచిన మురుగు నీరు

బనగానపల్లె: పట్టణంలోని ప్రభుత్వ క్రీడామైదానం ప్రాంగణంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహం పక్క భాగంలో నిలిచి ఉన్న మురుగునీటి వల్ల అక్కడి విద్యార్థినులు దుర్వాసన భరించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. బాలికలవసతి గృహంలో 6–10 వరకు 200 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడి బాతురూమ్‌లోని నీరు వేళ్లేందుకు డ్రైనేజీ వసతి లేకపోవడంతో పక్కనే ఉన్న క్రీడామైదానంలోనికి వెళ్తుండటంతో.. నీరు మైదానంలోకి వెళ్లకుండా కాంపొండ్ వాల్ పక్కభాగంలోనే పెద్దగుంతను తీశారు. బాతురూమ్‌లో నుంచి వచ్చిన నీరు ఈ గుంతలోకి చేరి నిల్వగా ఉన్నందున దుర్వాసన వెదజల్లుతోంది. కాగా, గుంత నిండి మురుగునీరు కొద్ది రోజులుగా క్రీడామైదానంలోకి వెళ్తుండటంతో క్రీడాకారులకు సైతం ఇబ్బందిగా మారింది. ఈ విషయంపై హాస్టల్ వార్డన్ ముంతాజ్ మాట్లాడుతూ సమస్యను సంబంధిత అధికారులకు వివరించామన్నారు. త్వరలో కాల్వ ఏర్పాటు చేసి నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

సీఎం టూర్.. ప్రయాణికులకు కష్టాలు


బనగానపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులేక వేచి ఉన్న ప్రయాణికులు


బేతంచెర్లలో కర్నూలు, నంద్యాల బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు


డోన్, బనగానపల్లె వైపు బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

కోవెలకుంట్ల: ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లా పర్యటనకు భారీగా బస్సులను తరలించడంతో ప్రయాణికులకు బుధవారం కష్టాలు తప్పలేదు. కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో నుంచి సీఎం పర్యటనకు 34 బస్సులు కేటాయించారు. దీంతో నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, కర్నూలు, తాడిపత్రి, తదితర ప్రధాన రూట్లల్లో ఎక్కువశాతం బస్సు సర్వీసులు రద్దు చేశారు. డిపో పరిధిలోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, గోస్పాడు మండలాలకు చెందిన ప్రజలు బస్సులు లేకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. మహిళలు , చిన్నపిల్లలు, వృద్ధులు, విద్యార్థులు అరకొర బస్సులతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లిన ప్రయాణికులు బస్సులు లేకపోవడంతో ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వచ్చింది.

బనగానపల్లె : అనంతపురంలో బుధవారం సీఎం చంద్రబాబు సమావేశం ప్రభావం ఆర్టీసీ ప్రయాణికులపై పడింది. బనగానపల్లె ఆర్టీసీ డిపోలో 64 బస్సులు ఉండగా 41 బస్సులు చంద్రబాబు సమావేశానికి వెళ్లగా మరో ఆరు విద్యార్థి బస్సులు ఉండగా 17 బస్సులను మాత్రమే ప్రయాణికులకు వినియోగించారు. బనగానపల్లె ఆర్టీసీ డిపో కేంద్రంగా కర్నూలు తాడిపత్రి గుత్తి నంద్యాల ప్రొద్దుటూరు ఆళ్లగడ్డతో పాటు మరిన్ని ప్రధాన రూట్లు ఉన్నాయి. ఈ రహదారులపై బనగానపల్లె డిపో బస్సులేకాక బనగానపల్లె మీదుగా ఇతర డిపోల నుంచి వచ్చే బస్సులు ప్రయాణికులకు కొంత ఊరట కల్పించాయి. సీఎం చంద్రబాబు పర్యటన వల్ల బస్సులు వెళ్లడంతో ఉన్న బస్సులు ఎప్పుడు వెళ్తాయో.. ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితుల్లో బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

బస్సుల కోసం పడిగాపులు

బేతంచెర్ల: అనంతపురం జిల్లాలో జరుగుతున్న సీఎం చంద్రబాబు నాయుడు సభకు ఆర్టీసీ బస్సులు వెళ్లడంతో బుధవారం ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. మండల కేంద్రం బేతంచెర్ల నుంచి కర్నూలు, నంద్యాల, డోన్, బనగానపల్లె వైపు వెళ్లడానికి బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు గంటల కొద్దీ పడిగాపులు కాశారు. అలాగే..విద్యార్థులు సైతం ఇక్కట్లకు గురయ్యారు. కొందరు ప్రైవేటు వాహనాలు, ఆటోల్లో వెళ్లగా, మరికొందరు అరకొరగా వచ్చిన బస్సుల్లో కిక్కిరిసిన జనంతో ఇబ్బందులు పడుతూ వెళ్లారు.

తప్పని ప్రయాణ కష్టాలు

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వం అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్ సూపర్‌హిట్ బహిరంగ సభకు ఆర్టీసీ బస్సులు తరలిపోవడంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడ్డారు. బస్సులు లేక పోవడంతో ఆటోల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. బస్సులు లేక పోవడంతో చాలా మంది విద్యార్థులు రాలేక పోయారు. అలాగే అవుకు మండలం రామాపురం, చెర్లోపల్లె నుంచి అవుకు వెళుతుంటారు. అవుకుతో పాటు పలు గ్రామాల నుంచి పదుల సంఖ్యలో విద్యార్థులు బనగానపల్లె పోయే వాళ్లు సైతం గైర్హాజరు అయ్యారు. అత్యవసర పనుల మీద వెళ్లాల్సిన వాళ్లు తప్పని సరి పరిస్థితుల్లో బైక్‌ల్లో పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్టాప్‌ల్లో గంటల తరబడి నిరీక్షించినా బస్సులు రాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

2 గంటల నుంచి వేచి చూస్తున్నా



ఉదయం 8గంటల నుంచి చూస్తున్నా రెండు గంటలవుతోంది ఒక్క బస్సూ రాలేదు. కర్నూలు ఆసుపత్రిలో బంధువులు చికిత్స పొందుతున్నారు. చూడటానికని బయలుదేరితే బస్సుల్లేవు. బస్సులను సీఎం సభకు తరలిస్తే ప్రజల ఆయా ప్రాంతాలకు ఎలా వెళ్లాలి. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇలా చేస్తే ప్రయాణికుల పరిస్థితి ఏంటి.

– వెంకటయ్య, ప్రయాణికుడు,బేతంచెర్ల